

ఎట్టకేలకు వంతెన పనులు

ధారూరు మండలం స్టేషన్‌ధారూరు-దోర్నాల్ మార్గంలో కాగ్నా నదిపై వంతెన నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. 8లో▸



శరణు కోరి..

డప్పు వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ నెల రోజుల పాటు రేణుక ఎల్లమ్మ జాతర వీనులవిందు చేసింది. 8లో▸



ఏం వండుకు తినాలి?

కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. మార్కెట్లో ఏ కాయగూరల ధరలు చూసినా రూ.100కు పైగా పలుకుతోంది. 9లో▸



ఆరోగ్యానికి 'యోగ'భాగ్యం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా అంతటా ఘనంగా నిర్వహించారు. సంపూర్ణ ఆరోగ్యానికి నిత్యం ధ్యానం, యోగా ఎంతగానో ఉపయోగపడతాయని వక్తలు పేర్కొన్నారు. తాండూరు పట్టణంలో పలు సంఘాల ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. యోగా ద్వారా కలిగే ప్రయోజనాలను గురువులు వివరించారు.

– తాండూరు టౌన్

ఉత్సాహంగా ఏరువాక..

ఏరువాక పర్వదినాన్ని శుక్రవారం రైతులు ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఎద్దులను అందంగా ముస్తాబు చేసి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. వ్యవసాయ పనిముట్లకు పూజలు చేశారు. బొంరాస్‌పేట మండలం రేగడిమైలారం గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయం చుట్టూ ఎద్దుల ప్రదక్షిణలు నిర్వహించారు.

– బొంరాస్‌పేట





'సార్'కు ఘన నివాళి

తెలంగాణ సిద్ధాంతకర్త.. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని శుక్రవారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని వక్తలు సూచించారు. తాండూరు పట్టణంలోని జయశంకర్ విగ్రహానికి పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

– తాండూరు టౌన్

న్యూస్‌రీల్

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి సత్తార్



రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సత్తార్

తాండూరు టౌన్: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు గడించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సత్తార్ అన్నారు. శుక్రవారం స్థానిక బాలాజీ మందిర్ ఆవరణలో ఆయిల్ పామ్ సాగుపై జిల్లా స్థాయి అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యధికంగా వంటనూనె దిగుబడి ఇచ్చే పంటల్లో ఆయిల్‌పామ్ ప్రధానమైందన్నారు. ఒక ఎకరా వరి సాగుకు అవసరమయ్యే నీటితో మూడెకరాల వరకు ఆయిల్‌పామ్ సాగు చేయవచ్చని తెలిపారు. ఎకరా స్థలంలో 57 మొక్కలు నాటవచ్చన్నారు. నాలుగేళ్ల తర్వాత పంట దిగుబడి ప్రారంభమవుతుందని 30 ఏళ్ల వరకు ఆదాయం పొందవచ్చని వివరించారు. ఎకరాకు 10 టన్నుల దిగుబడి వస్తుందని, రూ. లక్ష వరకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. అంతర పంటలు సాగు చేసుకోవచ్చని సూచించారు. సాగు ఖర్చుల తోపాటు పరికరాల కొనుగోలుకు నాలుగేళ్ల కాలంలో ఎకరాకు రూ. 50,918లు సబ్సిడీ వస్తుందని వివరించారు. రూ.192 విలువ చేసే ఆయిల్ పామ్ మొక్కను రూ. 20కు ఇవ్వనున్నట్లు చెప్పారు. పంట దిగుబడిని జిల్లాకు కేటాయించిన కంపెనీలు నేరుగా కొనుగోలు చేసి 14 రోజుల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తారని తెలిపారు. అధికారుల సూచనలు, సలహాలు పాటించి, ఉత్తమ యాజమాన్య పద్ధతులను అనుసరించి అధిక దిగుబడి పొందాలని సూచించారు. సమావేశంలో కన్సల్టెంట్ రంగ నాయక్, సలహాదారు బీఎస్ రావు, అసిస్టెంట్ డైరెక్టర్ లహరి, జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, ప్రధాన శాస్త్రవేత్తలు శ్రీ విజయన్, డాక్టర్ సుధాకర్, కో ఆర్డినేటర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రైనీ ఐఏఎస్‌ల క్షేత్రస్థాయి పర్యటన



మొయినాబాద్ రూరల్: నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

మొయినాబాద్‌రూరల్/మొయినాబాద్: రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డీలో శిక్షణ పొందడానికి వచ్చిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు జస్లీన్ కౌర్, అర్పిత్‌గుప్తా, అక్షయ్‌క్ష్ చౌదరి శుక్రవారం మొయినాబాద్ మండలంలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ముందుగా మండలంలోని అజీజ్‌నగర్ గ్రామ పంచాయతీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అక్కడున్న మండల అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డు, నర్సరీలను పరిశీలించారు. అనంతరం చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ వారికి ఆశీర్వాదం అందించి ఆలయ విశిష్టతను తెలియజేశారు. వారి వెంట జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్‌మోహన్, డీఎల్‌పీఓ సతీష్, ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

వసతి గ్రహాలు!

పేద విద్యార్థులు చదువుకునే బీసీ వసతి గృహాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. కనీస వసతులు కల్పించడంలో విఫలమవుతోంది. వ్యక్తిగత మరుగుదొడ్లపై విస్తృత ప్రచారం చేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులు ఆరుబయటికి వెళుతున్నా చర్యలు తీసుకోకపోవడం దారుణం. శిథిల భవనాల్లో ప్రమాదకర చదువులు కొనసాగుతున్నా పట్టించుకునే వారు లేరు.

శిథిలావస్థలో బీసీ వసతి గృహాలు

- పొంచి ఉన్న ప్రమాదాలు
- కనీస వసతులు కరువు
- నేటికీ ఆరుబయటికే విద్యార్థులు
- పట్టించుకోని పాలకులు



కుల్కచర్ల వసతి గృహంలో దెబ్బతిన్న పైకప్పు




పాడుబడిన భవనాన్ని తలపిస్తున్న కుల్కచర్లలోని బీసీ వసతి గృహం

కుల్కచర్ల: బీసీ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. శిథిలావస్థకు చేరిన భవనాలు, వసతులు లేకపోవడంతో విద్యార్థులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రమైన కుల్కచర్ల తోపాటు అంతారం, ముజాహిద్‌పూర్ గ్రామాల్లో బీసీ వసతి గృహాలు ఉన్నాయి. కుల్కచర్ల, ముజాహిద్‌పూర్‌లోని హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీటిలో దాదాపు 150మంది విద్యార్థులు ఉన్నారు. భవనం పైనుంచి పెచ్చులూ డి పడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరు గుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కనీస మరమ్మతులు కూడా చేపట్టడం లేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

నిధుల విడుదలలో వ్యత్యాసం

బీసీ వసతి గృహాలకు.. గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలకు విడుదలవుతున్న నిధుల్లో వ్యత్యాసం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు కొన్ని సంక్షేమాలు అందని దుస్థితి నెలకొంది. ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు క్రీడా దుస్తులు ఇస్తుండగా బీసీ విద్యార్థులకు మాత్రం అవి అందడం లేదు. ఎస్టీ వసతి గృహం విద్యార్థులకు షూస్, బ్యాగ్స్, నోటు పుస్తకాలు వంటివి ఇస్తారు. కానీ బీసీ విద్యార్థులకు మాత్రం ఇవ్వడం లేదు. కనీస వసతులు, సదుపాయాలు కల్పించకపోవడంతో బీసీ హాస్టల్‌లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు.



అంతారం బీసీ హాస్టల్‌లో అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణం

నేటికీ ఆరుబయటికే..

మండలంలోని అంతారం బీసీ హాస్టల్ విద్యార్థులు మల విసర్జనకు నేటికీ ఆరుబయటికే వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. పొలాల వెంబడి, చెట్ల మాటున పని కానిచ్చేస్తున్నారు. గతంలో పొలాల్లోకి వెళ్లిన విద్యార్థులను కొట్టిన సంఘటనలు కూడా లేకపోలేదు. ఆరుబయటికి వెళ్లిన సమయంలో విద్యార్థులు విష పురుగుల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం శిథిల భవనాలను కూల్చి కొత్త నిర్మాణాలు చేపట్టాలని, అలాగే కనీస వసతులు కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

పాలకులు పట్టించుకోవాలి



బీసీ సంక్షేమ వసతి గృహాల గురించి పాలకులు పట్టించుకోవాలి. హాస్టల్ విద్యార్థులు వసతులు లేక అవస్థలు పడుతున్నారు. కనీసం మరుగుదొడ్లు కూడా లేకపోవడం దారుణం. శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చి కొత్త బిల్డింగ్ కట్టాలి. లేకుండా విద్యార్థులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.

– సాయి కిరణ్‌గౌడ్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

ఎనీటైమ్ ఆన్ డ్యూటీ

- ఎస్పీ నారాయణరెడ్డి



బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ

అనంతగిరి: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు అహర్నిశలు పాటుపడతామని ఎస్పీ కే నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పని చేస్తామన్నారు. నేరాల నియంత్రణకు కృషి చేస్తామని చెప్పారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాల రవాణాపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించారు. గంజాయి విక్రయించినా, కొన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, కరుణసాగర్‌రెడ్డి, జానయ్య, వీరేష్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అనంతుడి సేవలో..

వికారాబాద్ సమీపంలోని అనంతగిరి శ్రీ అనంతపద్మనాభస్వామిని ఎస్పీ నారాయణరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

- స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు అడుగులు

కడ్తాల్: రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో వృత్తి నైపుణ్య విశ్వ విద్యాలయం (స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ) ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజధానికి అతి సమీపంలో ఉన్న కల్వకుర్తి నియోజకవర్గంలో ఏర్పాటు చేసేందుకు ఇటీవలే నిర్ణయం తీసుకుంది. 100 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయాలని భావిస్తుండడంతో అధికారులు ప్రభుత్వ భూముల పరిశీలనకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో పాటు సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి శివారులోని సర్వే నంబర్ 260/29, 321లలో ఉన్న ప్రభుత్వ భూములను కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పరిశీలించారు. సర్వే నంబర్ 260/29లో సుమారు 80 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించిన నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ ముంతాజ్, మాజీ సర్పంచ్ శంకర్, డీటీలు కృష్ణయ్య, శ్రీనివాస్, సర్వేయర్ పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నీట్‌పై విచారణ జరిపించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్

అనంతగిరి: నీట్ పరీక్ష అవకతవకలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ డిమాండ్ చేశారు. పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహించి ప్రధాని మోదీ రాజీనామా చేయాలన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం వికారాబాద్ ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్ష లీకేజీపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. పది రోజులుగా దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేస్తుంటే మోదీ మాత్రం మౌనంగా ఉన్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు రామకృష్ణ, సత్యనారాయణ, శ్రీనునాయక్, అక్బర్, అరవింద్, ముత్యం, నవీన్‌కుమార్, శంకర్, సలీం, బోజయ్య తదితరులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి' జిగేల్

- ఈ నెల నుంచే పథకం అమలు
- కోడ్ నేపథ్యంలో మూడు నెలలు ఆలస్యం
- జిల్లాలో గృహ కనెక్షన్లు 2.10లక్షలు
- అర్హత పొందిన వారు 1,14,455 మంది
- 200 యూనిట్లలోపు వాడిన వారికి పథకం వర్తింపు



వికారాబాద్: జిల్లాలో ఈ నెల నుంచే గృహజ్యోతి పథకం అమలు కానుంది. ఆ దిశగా అధికారులు కసరత్తు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి నెల నుంచే పథకం అమలు కాగా.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తోపాటు వికారాబాద్ జిల్లాలో జూన్ మాసం నుంచి అమలు చేస్తున్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. మార్చి నెలలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం తోపాటు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగించే వారికి గృహజ్యోతి పథకం అమలు చేశారు. అయితే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడం.. ఆ జిల్లా పరిధిలోని కొడంగల్ నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాలు వికారాబాద్ జిల్లాలో ఉండటంతో పథకం అమలు కాలేదు. ఆ వెంటనే పార్లమెంట్ ఎన్నికలు రావటంతో పథకం అమలు చేయలేక పోయారు.

అర్హుల జాబితా సిద్ధం

గృహ అవసరాలకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారిని గృహజ్యోతి పథకం కింద ఎంపిక చేస్తారు. దీంతో వారికి జీరో కరెంట్ బిల్లు వస్తుంది. ప్రజాపాలనలో ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించిన వివరాలు తప్పులు లేకుండా దరఖాస్తు చేసుకున్న ఈ పథకం అమలవుతుంది. జిల్లాలో 2.10 లక్షల డొమెస్టిక్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 200 యూనిట్లలోపు వాడే వారు 1,14,455 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరికి పథకం అమలు చేయాలని నిర్ణయించారు. అయితే ప్రతి నెలా ఈ సంఖ్య మారతుందని అధికారులు పేర్కొన్నారు. 200 యూనిట్ల లోపు వారికి మాత్రమే పథకం అమలవుతుంది. 200 యూనిట్లు దాటితే అనర్హులుగా మారతారు.

పలువురికి అధిక బిల్లులు

మే నెలకు సంబంధించి పలువురికి అధిక బిల్లులు వచ్చాయి. ప్రతి నెలా వెయ్యి రెండు వేలు వచ్చే వారికి ఈ సారి రూ.10 వేలకు పైగా బిల్లులు వచ్చాయి. అయితే చాలా మంది గృహజ్యోతి పథకం అమలవుతుందని నెలవారీ బిల్లులు చెల్లించలేదు. అటువంటి వారికి అధిక బిల్లులు వచ్చాయి. మరి కొంత మంది సాంకేతిక సమస్య కారణంగా ఎక్కువ బిల్లులు వచ్చాయి. ప్రతి నెలా 27 రోజులకు బిల్లులు తీసే సిబ్బంది ఈ నెల 37 రోజులకు బిల్లులు తీయడం వల్ల 200 యూనిట్లకు పైగా వచ్చినట్లు పలువురు తెలిపారు. ఇలాంటి పొరపాట్లు జరగకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

పోలీసులకు సహకరించాలి

ఏఎస్ఐ సూర్యనారాయణ



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

దోమ: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలంతా పోలీసులకు సహకరించాలని ఏఎస్ఐ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బ్రహ్మణపల్లి గ్రామంలో ఎస్ఐ ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు గ్రామస్తులు, వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న చిన్న గొడవలు సృష్టించుకొని ఇబ్బందులకు గురి కావొద్దని ప్రజలకు సూచించారు. ప్రతి వాహనదారుడు రోడ్డుపై ప్రయాణించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నర్సింహులు, కానిస్టేబుల్స్ బాల్‌రాజ్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కుల్కచర్ల: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన ఘటన మండల పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కాటనిపల్లి రాములు తన వ్యవసాయ పొలంలో గేదెలను మేపుతున్నాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ తీగకు తగిలి ఒక గేదె అక్కడికక్కడే మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.1.10 లక్షలు ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

దోపిడీ దొంగలను పట్టుకుంటాం

డీసీపీ రాజేశ్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ

తలకొండపల్లి: దారి దోపిడీ చేస్తున్న దొంగలను త్వరలోనే పట్టుకుంటామని డీసీపీ బల్ల రాజేశ్ అన్నారు. బుధవారం అర్ధరాత్రి దారిదోపిడీ జరిగిన స్థలాన్ని శుక్రవారం డీసీపీ పరిశీలించారు. అనంతరం ఆయన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ఎలాంటి నేరాలు జరుగుతున్నాయని.. పాత నేరస్తుల కదలికలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రంగస్వామి, సీఐలు ప్రమోద్‌కుమార్, శివప్రసాద్, ఎస్ఐలు బలరాం, శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేశంపేట ఠాణా సందర్శన

కేశంపేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శంషాబాద్ డీసీపీ రాజేష్ శుక్రవారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇటీవల జరిగిన చైన్‌స్నాచింగ్ జరిగిన ప్రదేశానికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడారు. చోరీలు, సైబర్ క్రైమ్‌లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాల అదుపునకు పోలీసులకు సహకరించాలని అన్నారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ రాంకుమార్, షాద్‌నగర్ రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్ఐ లింగం ఉన్నారు.

కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీ

కడ్తాల్: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతలపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాల గురించి ఆరా తీశారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్, ఏఎస్ఐ నిరంజన్ ఉన్నారు.

రాళ్ల లోడ్ ఖాళీ చేస్తుండగా..



విద్యుదాఘాతంతో దగ్ధమవుతున్న టిప్పర్

అబ్దుల్లాపూర్‌మెట్: రాళ్లలోడ్ ఖాళీ చేస్తున్న టిప్పర్ విద్యుత్ వైర్లకు తగలడంతో వాహనం దగ్ధమవ్వగా.. విద్యుదాఘాతంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ధీరజ్‌కుమార్(19) పెద్దఅంబర్‌పేటలో నివాసముంటూ అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధి కోహెడ శివారులో నిర్మాణం కొనసాగుతున్న మైత్రి విల్లాస్‌లో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం టిప్పర్‌లో తెచ్చిన పెద్ద బండరాళ్లను ఖాళీ చేస్తుండగా విద్యుత్ వైర్లకు తొట్టి తగిలింది. దీంతో డ్రైవర్ విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. ఆయన్ను వనస్థలిపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులకు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎట్టకేలకు వంతెన పనులు

- పెండింగ్ బిల్లుల చెల్లింపుతో ముందుకొచ్చిన కాంట్రాక్టర్
- త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికుల విజ్ఞప్తి



వంతెన పిల్లర్ల కింద స్లాబ్ వేయడానికి ఉంచిన సామగ్రి

ధారూరు: ఎట్టకేలకు మండలంలోని స్టేషన్‌ధారూరు–దోర్నాల్ మార్గంలో ఉన్న కాగ్నా నదిపై వంతెన నిర్మాణ పనులు శుక్రవారం తిరిగి ప్రారంభమయ్యాయి. ఈ వంతెన నిర్మాణానికి ఆది నుంచి అవరోధాలు ఎదురవుతూ వస్తున్నాయి. 2017 నుంచి బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడంతో వరుసగా ముగ్గురు కాంట్రాక్టర్లు మారారు. ఏడేళ్ల నుంచి నిర్మాణ పనులను సాగదీస్తున్నారు. ఈ సారైనా పనులు పూర్తవుతాయా లేదా అన్న సందేహంలో ప్రజలు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను సైతం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవ తీసుకుని ప్రస్తుతం కాంట్రాక్టర్‌కు ఇప్పించారు. దీంతో వంతెన నిర్మాణ పనుల్లో పురోగతి కనిపిస్తోంది.

రాకపోకలకు ఇబ్బంది

స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్యన కాగ్నా నదిపై ఉన్న పాత వంతెన 2016లో వరద ఉద్ధృతికి పూర్తిగా దెబ్బతింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది కలగడంతో పాత వంతెనను ధ్వంసం చేసి డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ మేరకు కొత్త వంతెన నిర్మాణానికి 2017లో రూ.4.70 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులను మూడేళ్లలో పూర్తి చేయాలని నిబంధన ఉంది. కాంట్రాక్టర్ అదే సంవత్సరంలో పనులు మొదలు పెట్టినా సకాలంలో బిల్లులు రాకపోవడంతో నిలిపివేశారు. డైవర్షన్ రోడ్డులో వేసిన సీసీ పైపులపై మట్టి సైతం నీటి ప్రవాహానికి కొట్టుకపోయింది. దీంతో కాగ్నా నదిని దాటాలంటే స్థానికులు భీతిల్లుతున్నారు.

రూ.2.70 కోట్లతో ప్రతిపాదనలు

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వంతెన నిర్మాణ పనులు ఆగిపోవడానికి కారణం తెలుసుకుని పెండింగ్ బిల్లును ఇటీవల కాంట్రాక్టర్‌కు ఇప్పించారు. 2017లో అయిన అగ్రిమెంట్‌లో ఉన్న రేట్ల ప్రకారం చేయడంతో నష్టపోవాల్సి వస్తుందని కాంట్రాక్టర్ వాదించిన స్పీకర్ నచ్చజెప్పి పనులు ప్రారంభమయ్యేలా చొరవ చూపారు. అలాగే వంతెనకు ఇరువైపుల రోడ్డు నిర్మాణానికి మరో రూ.2.70 కోట్లు నిధుల మంజూరుకు అప్రూవల్ చేయించారు. కాగ్నా నదిలో నీటి ప్రవాహం రాక ముందే నెలరోజుల్లో పైన నిలబెట్టిన గట్టర్లపై సీసీ స్లాబ్ వేయిస్తామని కాంట్రాక్టర్ పేర్కొన్నారు. వంతెన నిర్మాణాన్ని శరవేగంగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



శిక్షణా తరగతిలో మాట్లాడుతున్న సీడీపీఓ కాంతారావు

పూర్వ ప్రాథమిక విద్యతో విజ్ఞానం

సీడీపీఓ కాంతారావు

మోమిన్‌పేట: పూర్వ ప్రాథమిక విద్య పిల్లల్లో విజ్ఞానం పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుందని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీఓ) కాంతారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు 12 రోజుల శిక్షణా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను(ప్రీ ప్రైమరీ) అభ్యసించిన పిల్లలు ముందు చదవబోయే తరగతులలో మరింత చురుకుగా పాల్గొంటారన్నారు. ఈ విద్యతో పిల్లలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. నాలుగు బృందాలుగా ఏర్పడి 12 రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సూపర్‌వైజరులు, అంగన్‌వాడీ టీచరులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల భాషాభివృద్ధిపై దృష్టి సారించాలి

పరిగి: చిన్నారుల భాషాభివృద్ధి, శరీరక ఎదుగుదలపై దృష్టి సారించాలని ఇన్‌చార్జి సీడీపీఓ ఇందిర పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. క్లస్టర్ల వారీగా అంగన్‌వాడీ కార్యకర్తలకు వచ్చే నెల 10వ తేదీ వరకు శిక్షణ నిర్వహిస్తామన్నారు. ప్రతి బృందానికి రెండు రోజుల పాటు తర్ఫీదు ఇస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు చదువుతో పాటు ఏఏ అంశాలపై దృష్టి పెట్టాలనే అంశాలను శిక్షణ కాలంలో వివరిస్తారన్నారు. క్లస్టర్ల వారీగా నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి ప్రతిఒక్కరూ హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షకులు నీలవేణి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సుధీర్

జెడ్పీ సీఈఓ సుధీర్

ధారూరు: కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా నెలలో 1, 11, 21 తేదీల్లో ట్యాంకులు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ వేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈఓ) ఎం.సుధీర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమలు ప్రబలకుండా మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని ఆయన ఆదేశించారు. రోడ్లపై చెత్తాచెదారం పేరుకపోకుండా చూడాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులకు సంబంధించిన క్యాష్ బుక్‌లు సక్రమంగా నిర్వహించాలన్నారు. వచ్చిన డబ్బులో 60 శాతం తాగునీటికి విధిగా వెచ్చించాలన్నారు. నెలకోసారి జీపీ ప్రత్యేక అధికారి సమావేశం, రెండు నెలలకోసారి గ్రామ సభను నిర్వహించాలని సూచించారు. ఆయా గ్రామాలు, తండాల్లో ప్రతి ఇంటికి తాగునీరు సర్వే ఎంతవరకు వచ్చిందని ఆయన ఎంపీడీఓ నర్సింహులను ప్రశ్నించారు. మండలంలో 90 శాతం సర్వే పూర్తి అయిందని, త్వరలో పూర్తి చేయిస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీఓ సురేష్, ఇన్‌చార్జి ఏపీఎం పండరీ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన లేకుంటే చర్యలు

కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీత

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: మండలంలోని నాగులపల్లి ప్రాథమిక పాఠశాలకు పెద్దేముల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీత వెళ్లి సమయపాలనపై ఆరా తీశారు. 'సమయ పాలన లేకుంటే జీతం కట్' అనే శీర్షికతో శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు మండల విద్యాధికారులు స్పందించారు. ఎందుకు ఆలస్యం అయిందని, ఇలా ఎన్ని రోజుల నుంచి వస్తున్నారని పాఠశాల హెచ్‌ఎం వజీర్‌ను కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీత అడిగారు. రోజు సమయానికి వచ్చేవాళ్లమని, ఆటో ఆలస్యం కావడంతో 15 నిమిషాలు లేటుగా వచ్చినట్లు తెలిపారు. దీంతో ఇప్పటికైనా తీరు మార్చు కోవాలని సునీత ఉపాధ్యాయులకు హితబోధ చేశారు. సమయ పాలన పాటించకపోతే తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐదుగురు ఉపాధ్యాయులు ఒకేసారి ఆలస్యంగా రావడంపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు సమాచారం. అనంతరం గోపాల్‌పూర్ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు తప్పకుండా సమయపాలన పాటించాలని నొక్కి చెప్పారు.



పాఠశాలలో రిజిస్టర్ పరిశీలిస్తున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం సునీత

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

అనంతగిరి: వర్షాకాలంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, వైద్యశాఖ సంయుక్తంగా సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలలో ఎలాంటి చెత్త చెదారం, మురుగునీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, ఆర్పీలు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీంద్ర యాదవ్, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ నిఖిల్, డాక్టర్ కృప, సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రకాష్, ఇన్‌చార్జి శానిటేషన్ ఎస్సై యేసుదాసు, మెడికల్ అధికారులు, ఆశవర్కర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదన్నారు. అధికారులు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గతంలో నిర్వహించిన పలు అభివృద్ధి పనులకు త్వరలోనే నిధులు విడుదల చేస్తామన్నారు. మహిళలకు విద్యాభివృద్ధిలో బాధ్యతాయుతమైన స్థానం కల్పించాలన్న ఉద్దేశంతో అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. అధికారులు తమ విధుల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శించరాదని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్య హరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్‌నాయక్, వైస్ ఎంపీపీ రాజశేఖర్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ ఖరీం, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: తోరణం తెంపడానికి రైతుల ఉత్సాహం



తాండూరుటౌన్: సాయిపూర్‌లో ఎడ్లబండ్ల ఊరేగింపు

ఏరువాక వచ్చె.. రైతన్నకు ఊతమిచ్చె

ఏరువాక సాగారో రన్నో చిన్నన్న.. నీ కష్టమంత తీరునురో రన్నో చిన్నన్న అంటూ అన్నదాతలు ఏరువాక పౌర్ణమిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏరువాక ఉత్సవాలు ఊరూరా జరిగాయి. పౌర్ణమి సందర్భంగా రైతులు ఎద్దులను శుభ్రంగా కడిగి వాటికి అలంకరణ చేసి వీధుల మీదుగా ఊరేగించారు. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రైతులు నిర్వహించే తొలి పండుగ ఏరువాక. ఈ ప్రాంతంలో ప్రతి ఏడాది రైతులు దీన్ని ఘనంగా నిర్వహిస్తారు.



కొడంగల్: ఊరేగింపులో రైతుల కోలాహలం



దౌల్తాబాద్: ఎద్దుల ఊరేగింపు..



ధారూరు: అలంకరించిన ఎడ్లతో ఓ రైతు



పూడూరు: కంకల్‌లో కాడెద్దులను అందంగా తీర్చిదిద్దిన రైతు



దుద్యాల్: హస్నాబాద్‌లో..



పెద్దేముల్: మంబాపూర్‌లో గ్రామస్తుల సందడి

పట్టాలపై యువతి ఆత్మహత్యాయత్నం

అడ్డుకున్న రైల్వే పోలీసులు

అనంతగిరి: రైలు పట్టాలపైన ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన ఓ యువతిని ఆర్‌పీఎఫ్ పోలీసులు కాపాడారని సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఓ యువతి ప్రేమ వైఫల్యంతో మనస్తాపం చెంది రెండో ప్లాట్‌ఫాం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే రైలు పట్టాలపై వెళ్తుంది. అప్పటికే ప్లాట్‌ఫాంపై విధులు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు ప్రశాంత్‌కుమార్, దీపక్, స్వర్ణకుమారి వెంటనే ఆమెను గమనించి వెంట నడుచుకుంటూ వెళ్లి అడ్డుకున్నారు. వెంటనే ఆమెను కార్యాలయంలోకి తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆమెను వికారాబాద్ సఖీ సెంటర్‌కు తరలించారు.

ప్రమాదకరంగా మారిన చెట్ల తొలగింపు

పరిగి: పట్టణ కేంద్రంలోని 2వ వార్డులోని ప్రధాన రోడ్డుపై వర్షాలకు చెట్లు విరిగి ప్రమాదకరంగా మారాయి. దీంతో శుక్రవారం కౌన్సిలర్ అర్చనరవి కుమార్ చెట్లను తొలగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈదురులు గాలులకు చెట్లు విరిగి ప్రమాదకరంగా మారాయని వాటిని తొలగించి కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. మున్సిపాలిటీలో రెండో వార్డును ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.

శరణు కోరి.. అమ్మకు సెలవిచ్చి

- ముగిసిన రేణుక ఎల్లమ్మ జాతర
- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి

తాండూరు రూరల్: డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, భక్తుల కోలాహలం నడుమ నెల రోజుల పాటు సాగిన శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర వీనులవిందు చేసింది. తెలంగాణ–కర్ణాటక సరిహద్దులోని తాండూరు మండలం కోత్లాపూర్ గ్రామ శివారులో ఎల్లమ్మ ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. గత నెల 23న జాతర ప్రారంభమైంది. ఇందులో భాగంగా నాలుగు మంగళవారాలు, ఐదు శుక్రవారాలు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. తాండూరు ప్రాంతంలోని ఆయా గ్రామాల ప్రజలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ నెల 7న నిర్వహించిన రథోత్సవం, సిడే కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. శుక్రవారం ఆఖరు రోజు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు బోనాలతో నైవేద్యం సమర్పించుకున్నారు. ఉత్సవాలను ఆలయ ఈవో శేఖర్‌గౌడ్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ సందీప్‌రెడ్డి, నాయకులు నవీన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సాయిలు, గోపాల్, సురేశ్ సిబ్బంది రవి పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.